

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా అని ఆరా తీశారు. వంట గది, డార్మెటరీ, బాత్ రూంలను పరిశీలించారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని ఆమె ఆదేశించారు. పాఠశాల వెనుకవైపు ప్రహరీ లేకపోవడంతో పందులు, పాములు వస్తున్నాయని సిబ్బంది ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రహరీ నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని కేజీబీవీ స్పెషలాఫీసర్, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్ చెప్పారు. అలాగే ఒకటే నీటి సంపు ఉందని, అదనంగా మరొకదాని కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆయన చెప్పారు. ఆమె వెంట కేజీబీవీ ప్రిన్సిపాల్ శైలజ ఉన్నారు.

మొయినాబాద్ పీఎస్‌లో వీరరాఘవరెడ్డి

మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విచారించిన పోలీసులు

రంగరాజన్‌పై దాడి ఘటనపై ప్రశ్నల వర్షం

7



జిల్లాలో కొత్త టీచర్లు కొలువుదీరారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. ఎడతెగని పోరాటంతో సర్కార్ కొలువు దక్కించుకున్నారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఎట్టకేలకు విద్యాశాఖ ఉద్యోగాలిచ్చింది. డీఎస్సీ 2008లో మెరిట్ జాబితాలో ఎంపికై ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోచుకోని అభ్యర్థులకు ఎట్టకేలకు సర్కార్ ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చింది. రంగారెడ్డి జిల్లాలో 95 మందిని కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించారు. ఎంపికైన అభ్యర్థులకు శనివారం నియామక పత్రాలు అందజేయగా వారు సోమవారం విధుల్లో చేరారు.

- సుదీర్ఘ నిరీక్షణకు తెర
- 2008 డీఎస్సీ అభ్యర్థుల్లో 95 మందికి ఉద్యోగాలు
- నియామక పత్రాలు జారీ, పాఠశాలల కేటాయింపు
- అత్యధికంగా తలకొండపల్లి, అత్యల్పంగా నందిగామకు పోస్టింగ్

నెరవేరిన కల

కొలువుదీరిన కొత్త టీచర్లు

2008 డీఎస్సీ అభ్యర్థుల నియామకం

మండలం	అభ్యర్థులు		
ఆమనగల్లు	03	మాడ్గుల	05
చేవెళ్ల	05	మహేశ్వరం	04
చౌదరిగూడెం	11	మంచాల	03
ఫరూఖ్‌నగర్	08	మొయినాబాద్	02
ఇబ్రహీంపట్నం	04	నందిగామ	01
కడ్తాల్	05	శేరిలింగంపల్లి	02
కందుకూరు	03	షాబాద్	05
కేశంపేట	10	శంకర్‌పల్లి	03
కొందుర్గు	04	తలకొండపల్లి	13
కొత్తూరు	02	యాచారం	02
		మొత్తం	95

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 18 (ఆన్‌లైన్) : ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి ప్రభుత్వం, ఎస్‌జీటీ ఉద్యోగాలను డీఈడీ, బీఈడీ అభ్యర్థులతో 70 : 30తో భర్తీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించింది. అయితే డీఈడీ చేసిన అభ్యర్థులు ఎస్జీటీ ఉద్యోగాలు పూర్తిగా మాకే ఇవ్వాలని డిమాండ్ చేయడంతో నాడు వారితోనే ఉద్యోగాల భర్తీ చేసింది. కాగా అప్పటికప్పుడే ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న బీఈడీ అభ్యర్థులు తమ ఎస్‌జీటీలో అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా కోర్టును సైతం ఆశ్రయించారు. 17 ఏళ్ల తర్వాత కోర్టు తీర్పు ఆధారంగా ప్రభుత్వం వారికి కాంట్రాక్టు పద్దతిలో ఎస్‌జీటీ ఉద్యోగాలు కేటాయించింది. జిల్లాకు చెందిన 95 మంది

మిగతా 8వ పేజీలో...

అన్యాయం జరిగింది



ఎన్నో ఏళ్ల తర్వాత టీచర్ ఉద్యోగం వచ్చిందన్న సంతోషమే కానీ.. మాకు తీరని అన్యాయం జరిగింది. ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిన కాకుండా రెగ్యులర్ పోస్టింగ్ ఇచ్చి ఉంటే బాగుండేది. 2010లోనే మాకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇన్నేళ్లు నష్టపోయాం. ఎంతో మంది సర్వీసును కోల్పోతున్నారు. ప్రస్తుతం ఇచ్చిన కాంట్రాక్టు టీచర్ ఉద్యోగం కూడా సుదూర ప్రాంతానికి వేశారు. వచ్చే జీతం రవాణా ఖర్చులకే సరిపోనుంది. ప్రభుత్వం ఆలోచించాలి. ప్రస్తుతం ఉద్యోగంలో చేరిన కాంట్రాక్టు టీచర్లకు వెంటనే రెగ్యులరైజ్ చేయాలి.

భూపతిరెడ్డి మల్లారెడ్డి, బుల్కాపూర్ యూపీఎస్ స్కూల్, శంకర్‌పల్లి మండలం

బ్లూ డార్ట్ కార్గో విమానానికి

తప్పిన ముప్పు

- తలెత్తిన ల్యాండింగ్ గేర్ సమస్య
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండింగ్

శంషాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి వచ్చిన ఓ విమానానికి పెను ప్రమాదం తప్పింది. ఎయిర్‌పోర్టు వర్గాల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం చెన్నై నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన బ్లూడార్ట్ కార్గో విమానంలో ల్యాండింగ్ గేర్ సమస్య తలెత్తింది. అప్రమత్తమైన పైలెట్ ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వాలని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులను కోరాడు. అనుమతి లభించడంతో రన్‌వేపై విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో ఆ విమానంలో ఉన్న ఐదుగురు సిబ్బందికి పెను ప్రమాదం తప్పింది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ పట్టివేత


ఎయిర్‌పోర్టులో పట్టుబడిన విదేశీ కరెన్సీ

శంషాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం విదేశీ కరెన్సీ పట్టుబడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్తున్న ఓ ప్రయాణికుడి కదలికలపై సీఐఎస్‌ఎఫ్ సిబ్బందికి అనుమానం వచ్చింది. అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతని బ్యాగేజీలో విదేశీ కరెన్సీ ఉన్నట్లు గుర్తించారు. అతని నుంచి సుమారు రూ.22 లక్షల విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హైదరాబాద్‌కు చెందిన అమీర్ అహ్మద్‌గా అనుమానిస్తున్నారు.


రథంపై స్వామివారి ఊరేగింపు

నేత్రపర్వంగా రథోత్సవం, చక్రస్నానం

వైభవంగా కొనసాగుతున్న సమతాకుంభ్ బ్రహ్మోత్సవాలు

శంషాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్ సమతామూర్తి కేంద్రంలో సమతా కుంభ్ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తొమ్మిదో రోజు చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో అట్టహాసంగా రథోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దేవనాథస్వామి, రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రూ. 100 కోట్లతో అండర్‌పాస్ నిర్మాణాలు

- నిధులు మంజూరు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడి

షాద్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే గేట్‌ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రూ.100 కోట్లతో అండర్ పాస్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండలం పెంజర్ల, మేకగూడ, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కేశంపేట, చటాన్‌పల్లి, బూర్గుల, రాయికల్ గ్రామాలను అనుసంధానం చేస్తూ అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, వచ్చే నెల చివరి వారం, లేదా ఏప్రిల్ మొదటి వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు. ముఖ్యంగా కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల, మేకగూడ గ్రామాలకు వెళ్లే రహదారిలో అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణాలు లేక అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారన్నారు. ఈ విషయంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేయడంతో తాను ఇక్కడి పరిస్థితిని రైల్వే ఉన్నతాధికారులు, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. మొదట రైల్వే అధికారులు దీనికి అంగీకరించలేదన్నారు. అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటా చెల్లిస్తుందని, అవసరమైన స్థల సేకరణ కూడా చేపడుతుందని వారికి సూచించడంతో రైల్వే అధికారులు ఆమోదం తెలిపారని చెప్పారు. అలాగే షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో ఉన్న చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని వైజంక్షన్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 84కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ ఏడాదిలోపు దీనిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంకళ్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా.. ఏవోకు వినతి పత్రం

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 18 (ఆన్‌లైన్) : తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. నిర్మాణ ముడి సరుకుల ధరలను పేదలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవోకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కురుమయ్య, గౌరవ అధ్యక్షుడు బ్రహ్మయ్య, నాయకులు ముస్తాఫా, పార్వతి, నర్సింహ్మ, వెంకటయ్య, ఆనంద్, శంకర్, రాజు, రాములు, వెంకటస్వామి, అంజయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

- ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి


వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, ప్రస్తుతం జాతీయస్థాయి పదవుల్లో ఉన్నవారిలో సగానికి పైగా యువజన కాంగ్రెస్ నుంచి వచ్చిన వారే ఉన్నారని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామంలోని కోర్పోలు చంద్రారెడ్డి గార్డెన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వంశీచంద్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో దేశ భవిష్యత్ అంతా యువత చేతుల్లోనే ఉందని, అందుకు రాహుల్ గాంధీ ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే యువత కృషి ఎంతో ఉందన్నారు. అదే విధంగా యువజన కాంగ్రెస్ నాయకులందరూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేందుకు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. మరో నాలుగేళ్లలో రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, ఏఐసీసీ మెంబర్ కోట నీలిమ, ఫిషర్స్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి, చిగిరింత పారిజాత నర్సింహ్మారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, సురభి, మహేశ్వరం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆమనగల్లు రైతు దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నిజాయితీ గల మోసగాడు

సీఎం రేవంత్

హామీలపై కాంగ్రెసోళ్లను గల్లా పట్టి నిలదీయాలి

- రాష్ట్రంలో అన్నివర్గాలను దగా చేసిన కాంగ్రెస్
- కొడంగల్‌తో పాటు కల్వకుర్తి ప్రజలను మోసగించిన సీఎం
- కాంగ్రెస్ విధానాలతో దెబ్బతిన్న రియల్ ఎస్టేట్
- మళ్లీ మొదలైన రైతుల, విద్యార్థుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


సభకు హాజరైన ప్రజలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నిజాయితీగల మోసగాడని, మోసంలో ఆయన ఎవరినీ వదలడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుదీక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెసోళ్లను ఆరు గ్యారంటీలు, 420 హామీలపై గల్లా పట్టి నిలదీయాలని ప్రజలకు సూచించారు. ఓట్లేసి గెలిపించిన కొడంగల్ తోపాటు సొంత నియోజకవర్గమైన కల్వకుర్తి ప్రజలను సీఎం మోసం చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్‌వ్యాపారం దెబ్బతిందని ఆరోపించారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి రాక ముందు రైతు భరోసా కింద రూ. 15 వేలు రైతులకు, రైతు కూలీలకు రూ. 12 వేలు, మహిళలకు నెలకు రూ. 2500, పింఛన్లు రూ.4వేల నుంచి రూ.6వేలు, యువతులకు స్కూటీలు, ఆడపిల్లల వివాహానికి తులం బంగారం ఇస్తామని ఇలా అందరినీ మోసగించిన ఘనత రేవంత్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ పాలనలో లూటీలే తప్ప స్కూటీలు లేవని ఎద్దేవా చేశారు. మూడెకరాల లోపు ఉన్నవారికి రైతుబంధు వేశామని ప్రభుత్వం చెబుతున్నా పది శాతం మందికీ అందలేదని, రూ.2 లక్షల రుణమాఫీ సగం మంది కూడా జరగలేదన్నారు. రైతులకు ఎకరాకు రూ. 17,500 చొప్పున రేవంత్ సర్కార్ రైతుబంధు

మిగతా 7వ పేజీలో...

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

చౌదరిగూడ, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్ధుల జంగయ్య ఆరోపించారు. మంగళవారం తుమ్మలపల్లి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వమేర్పడి 14 నెలలు గడిచినా సంక్షేమ పథకాల అమలు కావడం లేదన్నారు. ఈ నెల 25న తుక్కుగూడలో నిర్వహించే సెమినార్‌కు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్, కృష్ణ, బాల్‌రాజ్, షబ్బీర్, అనంత, చిన్నయ్య, వీరేష్, రత్నయ్య, బాలమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్, నీటి అంతరాయం లేకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ సుధీర్, అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. వేసవిలో నీటిఎద్దడి రాకుండా చూడాలని హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షించారు. అర్హులందరికీ రైతుభరోసా పథకం అందించేలా చర్యలు చేపడుతున్నామని, రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ కార్డులందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్య లేకుండా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్డీఏ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ అధికారి మోహన్‌బాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ లీలావతి, మిషన్ భగీరథ జిల్లా అధికారి చలమారెడ్డి, మత్స్యశాఖ అధికారి వెంకయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులు రుణ లక్ష్యాలను అధిగమించాలి

జిల్లాలోని అన్ని బ్యాంక్‌లు తమకు కేటాయించిన రుణ లక్ష్యాలను అధిగమించేలా కృషిచేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. కలెక్టరేట్‌లో 2025-26సంవత్సరానికి నాబార్డ్ రూపొందించిన పొటెన్షియల్ లింక్ క్రెడిట్ ప్లాన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నాబార్డ్ యేటా ప్రతి జిల్లాకు పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ రూపొందిస్తుందని, ప్రాధాన్యతా విభాగంలో జిల్లాలో భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేసి, లీడ్ బ్యాంక్ అమలు చేయాల్సిన వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను రూపొందిస్తుందన్నారు. పంట ఉత్పత్తి, నిర్వహణ మార్కెటింగ్ కోసం రూ.3872.65కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు టర్మ్‌లోన్ రూ.1279.1కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయలకు రూ.150.02 కోట్లు, అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలకు రూ.331.28కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు రూ.608.48కోట్లు ఇతర ప్రాధాన్యత రంగ రుణాలు(విద్య, హౌసింగ్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రెన్యూవబుల్ ఎనర్జీ మొదలైన వాటికి) 1190.97కోట్లు ఉందన్నారు. జిల్లాలో ప్రాధాన్యత రంగానికి నాబార్డు రూ.7432.51కోట్ల అంచనా వేసిందన్నారు. కార్యక్రమంలో డీడీఎం నాబార్డు అఖిల్ వున్నా, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, ఫిషరీస్ వెంకయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

బయల్పడిన వినాయక విగ్రహం



బయటపడిన వినాయక విగ్రహం



తాండూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పొలాల్లో దున్నుతుండగా నాగలికి తగిలి విగ్రహాలు బయటపడటం సాధారణంగా జరుగుతుంటాయి. అయితే ఓ ఆంజనేయస్వామి ఆలయంలోని గోడలో వినాయక విగ్రహం బయల్పడింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం చంద్రవంచ సమీప చంద్రవంచ-కరన్‌కోట్ రోడ్డులో పల్లెగూడ ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో 40ఏళ్ల క్రితం నుంచి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో మూలన ఉన్న ఓ రాయికి చంద్రంపూసే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. రెండు రోజుల క్రితం పూజారి స్వామివారికి, అనంతరం రాతికి చంద్రం పూశాడు. చంద్రం పూస్తున్న క్రమంలో రాయి ఊడొచ్చింది. ఆ రాయి వెంట విఘ్నేశ్వర విగ్రహం బయటికి వచ్చింది. ఈ విషయాన్ని పూజారి గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆంజనేయాలయంలో వినాయకుడి విగ్రహం బయటపడడం అద్భుతమని గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు.

24న లింగ ప్రతిష్ఠాపన: పల్లెగూడ ఆంజనేయస్వామి ఆలయానికి అగ్గనూరు అశోక్‌కుమార్, అగ్గనూరు శోభావతి కొంత భూమిని ఇచ్చారు. ఆ స్థలంలో జై భారత్ మాత సేవా సమితి న్యూఢిల్లీ గురుహవా మల్లినాథ్ మహారాజ్ నిరుగుడి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన లింగ ప్రతిష్ఠాపన చేస్తారని గ్రామస్తులు తెలిపారు.

ఇళ్ల స్థలాలకు పొజిషన్ చూపుతాం



వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్, పేదలు

కందుకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కందుకూరులో గతంలో ఇండ్ల స్థలాలకు సర్టిఫికెట్లు ఇచ్చిన వారికి త్వరలోనే పొజిషన్ చూపుతామని ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్‌తో కలిసి లబ్ధిదారులు తమకు ప్లాట్ పొజిషన్ చూపాలని ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చారు. వారితో ఆర్డీవో మాట్లాడారు. కందుకూరు గ్రామ పరిధిలోని 788, 107 సర్వే నంబర్లలో గతంలో పేదలకు ఇండ్ల స్థలాల కోసం పట్టాలు ఇచ్చాని తెలిపారు. 788 సర్వే నంబర్ భూమిలో గుట్టలతో కూడిన పెద్దరాళ్లు ఉండడంతో వారికి పొజిషన్ చూపలేకపోయామని తెలిపారు. లబ్ధిదారుల విన్నపం మేరకు వారం రోజుల క్రితం రెండు సర్వే నంబర్లను డిప్యూటీ సర్వేయర్ క్రిష్ణయ్యతో సర్వే చేయించామని తెలిపారు. వినియోగ యోగ్యానికి ఎంత భూమి ఉందనే నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో త్వరలో పొజిషన్ చూపుతామన్నారు. కార్యక్రమంలో గుడిసెల పోరాట సంఘం అధ్యక్షుడు ఆర్.శేఖర్, సీఐటీయూ నాయకుడు గాదె సత్తయ్య, రాములు, యాదయ్య, జంగయ్య, సక్కుబాయి, యదమ్మ, కవిత, పి.అరుణ, రాములు, గంగమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

- దౌల్తాబాద్‌లో ఘటన
- 11ఏళ్లలోపు ముగ్గురు చిన్నారులు

దౌల్తాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌లో మంగళవారం జరిగింది. దౌల్తాబాద్‌కు చెందిన మహబూబ్(32), లతీఫా(28) భార్యాభర్తలు. మహబూబ్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. వీరికి 11ఏళ్లలోపు పిల్లలు ఓ కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో చదువుతున్నారు. మంగళవారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న పిల్లలు ఇంటి తలుపులు మూసి ఉండటంతో బయటే కూర్చున్నారు. గమనించిన స్థానికులు అనుమానంతో కిటికీలోంచి చూడగా మహబూబ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా కన్పించాడు. తలుపులు పగలగొట్టి చూడగా అక్కడే నేలపై లతీఫా మృతదేహం ఉంది. అయితే మహబూబ్ భార్యను చంపి అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు అనుమానించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చనిపోయిన భార్యాభర్తలకు సంబంధించి పిల్లలు తప్ప ఎవరూ అందుబాటులో లేరని, వారి మృతికి గల కారణాలను త్వరలోనే తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.



ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థినులు

వైవిధ్య రాష్ట్రాలు భారత్ గొప్పతనం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'ఈశాన్య భారతం, వైవిధ్య రాష్ట్రాలు మన దేశ గొప్పతనం అని, భిన్నత్వంలో ఏకత్వం దేశ సంస్కృతిని చాటుతుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని యూనివర్సిటీలో 'నార్త్-ఈస్ట్ ఫెస్ట్'ను నిర్వహించారు. ఈశాన్య భారతం ప్రత్యేక సంస్కృతిని కలిగి ఉన్న ప్రాంతం అని కొనియాడారు. వారిజీవన విధానం ముచ్చటగొలుపుతుందని అన్నారు. ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర్, సాత్వికరెడ్డి, రవీందర్, శంకర్ లింగం, ప్రత్యూషరెడ్డి, ఫరీద్, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


నక్ష సర్వేను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్, సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి సుధీర్ గోలి

కొడంగల్‌లో నక్ష సర్వే ప్రారంభం

- భూ సంబంధిత వివాదాలకు చెక్

కొడంగల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నక్ష పైలెట్ సర్వేతో ఇళ్లు, భూ సంబంధిత వివాదాలకు చెక్ పడుతుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్, సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి సుధీర్‌గోలి అన్నారు. మంగళవారం కొడంగల్ శివారులోని తాండూరు రోడ్డులో హెలిప్యాడ్ వద్ద నక్ష సర్వేను అధికారులతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రెండు రోజులు కొనసాగే ఈ సర్వేలో వ్యవసాయ సాగు భూముల మాదిరిగానే మున్సిపాలిటీలోనూ పక్కాగా సర్వే చేసి నక్ష రూపొందిస్తామని తెలిపారు. ఎవరి జాగా ఎంతో కచ్చితంగా తెలుస్తుందన్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని ఇళ్లు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాల సర్వేతో హద్దులు, విస్తీర్ణాన్ని డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్ చేస్తామని వివరించారు. నక్ష సర్వేకు కొడంగల్‌కు ప్రత్యేక హెలిక్యాప్టర్‌ను తెప్పించామని తెలిపారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుధీర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులిక్కడ.. టీచర్ ఎక్కడ?

- ఉపాధ్యాయిని రాక సాగని చదువు


క్లాస్ రూంలో కూర్చున్న విద్యార్థులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు విద్యార్థులు ఆ పాఠశాల తరగతిలో ఉపాధ్యాయురాలి కోసం ఎదురు చూసినా ఆమె రాలేదు. దీంతో చిన్నారుల చదువు సాగడం లేదు. ఇది వారికి నిత్యకృత్యంగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం బోయగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సునీత స్కూలుకు రాక విద్యార్థులు ఊరికే కూర్చొని వెళ్తున్నారు. టీచర్ విధులకు రాకుంటే పిల్లలకు చదువెలా వస్తుందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. 'ఆ స్కూల్ టీచర్ రోజూ వస్తున్నట్టు మాకు చెబుతున్నారు. రావడం లేదా? అని ఎదురు ప్రశ్నించారు.

రోడ్డుకు అడ్డుగా ఉన్న నిర్మాణాల కూల్చివేత

శామీర్‌పేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాకపోకలు సాగించే రోడ్లకు అడ్డుగా ఉన్న 8 నిర్మాణాలకుగాను రెండింటిని మంగళవారం హైడ్రా కూల్చివేసింది. తూంకుంట మున్సిపాలిటీ పరిధి దేవరయంజాల్‌లోని 13వ వార్డులో ఎస్సీ కాలనీలో దళిత కుటుంబాలున్నాయి. వారు రాకపోకలు సాగించేందుకు ఎనిమిది చోట్ల రోడ్లను ఏర్పాటు చేశారు. అనంతరం వెలసిన తిరుమల కాలనీ వాసులు దళితులు రాకపోకలు సాగించే రోడ్లకు అడ్డుగా గోడలను, బేస్మెంట్లు కట్టారు. దీంతో కాలనీల వాసులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. ఈ నిర్మాణాలను కూల్చాలని తెలంగాణ రాష్ట్ర దళిత సమాఖ్య అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని హైడ్రా కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. రాకపోకలు సాగించేందుకు రోడ్లను క్లియర్ చేయాలని కమిషనర్‌కు మొరపెట్టుకున్నాడు. దీంతో రోడ్లకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను కూల్చారు. తిరుమల కాలనీ వాసులు కూల్చివేతలను అడ్డుకున్నా రెండు గోడలను కూల్చి రాకపోకలకు వీలు కల్పించారు. కూల్చివేతలకు రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక డిజాస్టర్ రెస్పాన్స్ వెహికిల్, రెండు టిప్పర్లను, 30మంది సిబ్బందిని వినియోగించారు. అయితే దళితులు రాకపోకలు సాగించే మిగతా ఆరు నిర్మాణాలూ కూల్చాలని కాలనీ వాసులు ఆందోళన చేశారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గేమింగ్ డెవలప్‌మెంట్‌పై నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇన్‌టెల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ప్రొఫెసర్ మల్లికార్జున్ తెలిపారు. పోచారం పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ఐఎస్‌టీఈ ఆధ్వర్యంలో గేమింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వన్ డీ గేమింగ్ అభివృద్ధిని ఎలా చేయాలనే విషయాలను వివరించారు. సాంకేతిక అంశాలపై నేర్పించారు. అనంతరం గేమింగ్‌పై క్విజ్ నిర్వహించారు. 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మొయినాబాద్ పీఎస్‌లో వీరరాఘవరెడ్డి

- మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విచారించిన పోలీసులు
- రంగరాజన్‌పై దాడి ఘటనపై ప్రశ్నల వర్షం


పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిందితుడు వీరరాఘవరెడ్డి

మొయినాబాద్: ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌పైదాడి కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డిని కస్టడీకి తీసుకున్న పోలీసులు విచారణ చేపడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రశ్నించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పర్యవేక్షణలో మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సమక్షంలో విచారణ చేపట్టారు. సీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఓ అధికారి సైతం విచారణ సమయంలో అక్కడే ఉన్నారు. రాత్రి వరకు విచారణ కొనసాగింది. నిందితుడికి మధ్యాహ్న భోజనం స్టేషన్‌లోనే ఏర్పాటు చేశారు. పోలీసులు ముందుగా తయారు చేసుకున్న ప్రశ్నావళి ప్రకారం విచారణ కొనసాగించినట్లు తెలిసింది. మొదటి రోజు వీరరాఘవరెడ్డి బాల్యంతో పాటు అతని జీవన విధానం, విద్యాభ్యాసం, కుటుంబ నేపథ్యం, మానసిక పరిస్థితి, ఆర్థిక స్థితిగతుల గురించి విచారించినట్లు సమాచారం. చిలుకూరు ఆలయంలో జరిగిన సంఘటన గురించి కాకుండా అతని బాల్యంతో పాటు అనంతరం చేసిన కార్యక్రమాలు, జరిగిన సంఘటనల గురించి పోలీసులు ఆరా తీశారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు వీరరాఘవరెడ్డి సరైన సమాధానాలు చెప్పడం లేదని తెలిసింది. ఇంకా రెండు రోజుల పాటు విచారణ చేయనున్నారు. రంగరాజన్‌పై దాడి ఎందుకు చేశాడు. అతని ఉద్దేశం ఏమిటి..? ఒక్కడే చేశాడా..?, లేదా అతనికి సపోర్టుగా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసు దర్యాప్తు చేయనున్నారు. అయితే హిందూధర్మ పరిరక్షణ కోసమే తాను రామరాజ్యం సంస్థను ఏర్పాటు చేసినట్లు నిందితులు వీరరాఘవరెడ్డి పోలీసులకు సమాధానం చెప్పినట్లు తెలిసింది. తన సంస్థ కార్యకలాపాలు సజావుగా జరగాలంటే ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదని పూజారుల నుంచి ఆర్థిక సహకారం తీసుకోవాలని భావించాడని అందులో భాగంగానే చిలుకూరు వచ్చినట్లు తెలుస్తుంది.

రామరాజ్యం స్థాపనే లక్ష్యమంటూ..

రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి స్వస్థలం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలంలోని కొప్పవరం. ప్రస్తుతం మణికొండలో నివాసం ఉంటున్నాడు. గతంలో అతను సంగీతం టీచర్‌గా పని చేశాడు. పోలీసులు, కోర్టులు ధర్మస్థాపన కోసం పనిచేడం లేదనేది అతిని భావన. రామరాజ్య స్థాపన కోసం ఓ సంస్థ ఉండాలని భావించాడు. తనకు తాను ముక్కంటి అవతారంగా భావించాడు. 2022లో కోసలేంద్ర ట్రస్ట్ పేరిట రామరాజ్యం ఆర్మీని ఏర్పాటు చేశాడు. 20 ఏళ్ల మధ్య నుంచి 50 ఏళ్ల వయసున్న వారిని సభ్యులుగా చేర్చుకోవాలని నిర్ణయించాడు. తొలివిడతలో సుమారు 5వేల మందిని చేర్చుకోవాలని సోషల్‌మీడియాలో ప్రచారం చేశాడు. తన సంస్థలో చేరేందుకు 36 మంది దరఖాస్తు చేసుకోగా అందులోంచి 25 మందిని ఇదే సంవత్సరం జనవరిలో సభ్యులుగా చేర్చుకున్నాడు. ఎంపికైనవారికి నెలకు రూ.20 వేల జీతం ఇస్తానని చెప్పాడు. న్యాయవ్యవస్థను కొందరు నిర్లక్ష్యం చేసున్నారని సభ్యులకు వివరిస్తూ, తాము చేయాల్సిన కార్యక్రమాల గురించి వివరించేవాడు. ఇందుకు సంబంధించి ఏపీలో కొన్ని సమావేశాలు సైతం నిర్వహించాడు. సభ్యులందరికీ ప్రత్యేక యూనిఫాం ఉండాలని సూచించాడు. అయితే ముందుగా అనుకున్న ప్రకారం ఈనెల 7వ తేదీన సభ్యులందరితో కలిసి చిలుకూరు ఆలయానికి వెళ్లారు. తాము చెప్పినట్లు వినాలని, తనకు సహక రించాలని రంగరాజన్‌కు చెప్పారు. అందుకు ఆయన సహకరించకపోవడంతో దాడి చేశారు. వీరరాఘవరెడ్డి ఇదే తరహాలో నగరశివారులోని కొన్ని ఆలయాలకు వెళ్లి తమకు సహకరించాలని కోరాడు. అందుకు కొందరు సరే అనడంతో విషయం బయటకు రాలేదు.

చిలుకూరులో బెడిసికొట్టింది..

ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం వీరరాఘవరెడ్డి తన సభ్యులతో కలిసి చిలుకూరుకు వచ్చాడు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఇంట్లోకి వెళ్లారు. తనకు కొంత మందిని ఇవ్వాలని.. అదేవిధంగా ఆర్థికంగా సహకరించాలని డిమాండ్ చేశాడు. అయితే రంగరాజన్ అందరు అర్చకుల్లా కాకుండా.. తాను న్యాయబద్ధంగా ముందుకు వెళ్తానని చెప్పడంతో, అది జీర్ణించుకోలేని వీరరాఘవరెడ్డి అతనిపై దాడి చేశాడు.

నిజాయితీ గల మోసగాడు సీఎం రేవంత్

(ఐదో పేజీ తరువాయి)

బాకీ పడిందని కేటీఆర్ ఆరోపించారు. నాడు ప్రాజెక్టుల నిర్మాణం, సాగునీటి కల్పనతో పాలమూరుకే ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు వలస వచ్చారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాది తిరుగకముందే మళ్లి పాతపరిస్థితులు మొదలయ్యాయన్నారు. ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, రైతులు, ప్రభుత్వ విధానాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రభుత్వంలో చలనం లేదని కేటీఆర్ మండిపడ్డారు.

పాలమూరుకు రేవంత్ చేసిందేమీలేదు : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

పాలమూరు బిడ్డనని పదే పదే చెప్పుకునే సీఎం రేవంత్ సొంతజిల్లాకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. విదేశాలతో పాటు 35 సార్లు ఢిల్లీకి వెళ్లి రావడానికి సమయం దొరికిన సీఎంకు 90 శాతం పనులు పూర్తైన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సందర్శించడానికి, మిగులు పనులు పూర్తి చేయించడానికి సమయం దొరకడం లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, విపక్షాలను తిట్టడమే తప్ప 15 నెలల పాలనలో రేవంత్ ప్రజలకు చేసిందేమి లేదని మండిపడ్డారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మోసపూరిత కాంగ్రెస్ కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర మాజీమంత్రి సూదిని జైపాల్ రెడ్డి పేరుపెట్టారే తప్ప ఒక్క పైసా కేటాయించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 300 గురుకులాలను 1020కి పెంచి పేద పిల్లలకు ఉన్నత భవిష్యత్ కల్పిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, గువ్వల బాల్‌రాజ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా విశ్వాసం కోల్పోయిందని, ఇక ఎంతో కాలం మన లేదన్నారు. సొంత నియోజకవర్గమైన కల్వకుర్తి నుంచే రేవంత్ రెడ్డి పతనం ప్రారంభమైందన్నారు.

రైతు దీక్షలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ లు వాణిదేవి, నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు, రాష్ట్ర ఫుడ్‌కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు గువ్వల బాల్‌రాజ్, మర్రిజనార్దన్ రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, బాల్క సుమన్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ కార్పోరేషన్ చైర్మన్ రజనిసాయిచంద్, బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి, దశరథ్ నాయక్, జీఎల్ఎన్ రెడ్డి, గంప వెంకటేశ్, ఎడ్మ సత్యం, సీఎల్ శ్రీనివాస్ యాదవ్, నిర్మలశ్రీశైలం గౌడ్, అనురాధపత్యానాయక్, అర్జున్‌రావు, జైపాల్ రెడ్డి, నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, విజయ్‌గౌడ్,సయ్యద్ ఖలీల్, గోపాల్ నాయక్, టిప్పు సుల్తాన్, లాయక్‌అలీ, లచ్చిరామ్ నాయక్, సైదులు గౌడ్, సుభాష్ , సతీష్, చంద్రశేఖర్ రెడ్డి,శంకర్, లాలయ్యగౌడ్, భాస్కర్ రావు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం.....

ఆమనగల్లు పట్టణంలో రైతు దీక్షకు హాజరైన కేటీఆర్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోస్టాఫీస్ నుంచి హైదరాబాద్- శ్రీశైలం జాతీయరహదారి మీదుగా మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు కేటీఆర్ వాహనాల కాన్వాయ్ కొనసాగింది. అదేవిధంగా కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని కేటీఆర్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికిప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందుకూరులో...

కందుకూరు : ఆమనగల్లులో చేపట్టిన రైతు దీక్షకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కందుకూరులో ఆ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, రాజయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలు మంగళవారం ఉదయం 11:30గంటలకు మండల కేంద్రానికి చేరుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్, టి.ఇందిరదేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, జిల్లా నాయకులు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, కాకి దశరథ, సామ మహేందర్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎలుక మేఘనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌కు స్వాగతం పలికారు. సుమారు గంట పాటు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిర్వహించిన భారీ ర్యాలీలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం దెబ్బడగూడ గేటు వద్ద పార్టీ జెండాను ఎగరవేశారు. ర్యాలీలో దొంగలు చేతివాటం చూపారు. మురళీనగర్‌కు చెందిన బాల్‌రాజ్ పాయింట్ జేబులో రూ.25వేలు దొంగిలించారు.



శివారు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఇటీవల నియమాకం చేసిన ప్రత్యేకాధికారులను తొలగించి వారి స్థానంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులను నియమించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ మంగతయారు, గుండ్లపోచంపల్లికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ ఎస్.యాదగిరిరావు, బోడుప్పల్‌కు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ ఎస్.పంకజ, పోచారానికి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఓఎస్డీ విద్యాధర్, పీర్జాదిగూడకు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సత్యనారాయణ, నార్సింగికి ఎంఆర్‌డీసీఎల్ ఈడీ శ్రీనివాస్‌రెడ్డి, శంషాబాద్‌కు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ గీతారాధిక, శంకర్‌పల్లికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సామ్రాట్ అశోక్, జల్పల్లికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ నళిని పద్మావతి, సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌నకు జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ వాణిశ్రీ, సంగారెడ్డి జిల్లా బొల్లారానికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిలను నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

వికారాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ యూనియన్(ఎఫ్‌పీఎస్‌టీ) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫిజికల్ సైన్స్ ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్ నిర్వహించగా వికారాబాద్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వికారాబాద్ సంకల్ప్ స్కూల్‌లో స్టేట్ లెవెల్ ఫిజికల్ సైన్స్ ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్ మంగళవారం వికారాబాద్‌లోని సంకల్ప్ విద్యాపీఠం స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో హర్షిత్ ఆదిలాబాద్ మొదటి స్థానం, నక్క విష్ణువర్ధన్(మహబూబ్‌నగర్ రెండో స్థానం), వర్షిత్‌రెడ్డి వికారాబాద్ మూడో స్థానం దక్కించుకున్నారు. జిల్లా పరీక్షల్లో అబూ బాకర్(ధారూరు) మొదటి స్థానం, వర్షిత్‌రెడ్డి (వికారాబాద్), రెండో స్థానం, శ్రీకాంత్(దోమ), పవన్(దోమ) 3, 4వ స్థానాలు సాధించారు. వీరిని రిటైర్డ్ ప్రొఫెసర్ ముత్తారెడ్డి, ఎఫ్‌పీటీఎస్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ కమాల్‌రెడ్డి గైడ్ టీచర్స్, తోటి విద్యార్థులు అభినందించారు.

రైతు దీక్షల పేరుతో కేటీఆర్ చిల్లర రాజకీయాలు

- విషం కక్కుతున్న మాజీ మంత్రి
- పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతు దీక్షల పేరుతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుట్ర రాజకీయాలు చేస్తున్నారని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడమే కేటీఆర్ దినచర్యలో భాగంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఆమనగల్లులోని మార్కెట్ యార్డ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధిని అడ్డుకోవడమే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారని, ప్రభుత్వాన్ని అస్థిరపర్చే కుట్ర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. అభివృద్ధిపై కేటీఆర్, వారి పార్టీ నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. వెల్దండ, మాడ్గులలో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు వేల ఎకరాల భూములు కొన్నారని అందుకే మాడ్గులకు పెద్ద రోడ్డు వేస్తున్నారంటూ కేటీఆర్ ఆరోపించడం ఆయన కుట్ర రాజకీయాలకు, అక్కసుకు నిదర్శనమన్నారు. వేల ఎకరాలు ఎక్కడున్నాయో చూపాలని, లేకుంటే రేవంత్‌రెడ్డి కుటుంబానికి క్షమాపణ చెప్పాలన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలే రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. ప్రజల తిరస్కారంతోనే కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు పరిమితమయ్యారని, ఆయనకు ప్రజాసమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు కల్వకుర్తికి వివిధ పథకాల కింద ఇప్పటికే రూ.వెయ్యి కోట్లు వెచ్చించారన్నారు. ఆమనగల్లు రైతు దీక్షకు రైతులే రాలేదని, బీఆర్ఎస్ నాయకులతో మమ అన్పించారని విమర్శించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, పి.మానయ్య, మాజీ ఎంపీపీ ధనుంజయ, నాయకులు వెంకటేశ్, ఖలీల్, అప్పం శ్రీను, శివలింగం, అలీం, ఖాదర్, కరీం, ప్రసాద్, ఖాదర్ ఖాద్రీ, విజయ్, మల్లయ్య, పాండురంగయ్య, శ్రీశైలం, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబీకుల ఉదారత

అనాథాశ్రమానికి విరాళం అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మండలం బుల్కాపురానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఈ నెల 6న రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని ఆయన స్నేహితులు అన్నారు. 2018 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ స్నేహితులు శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.1,10,100 జమచేశారు. ఆ డబ్బును శ్రీనివాస్ కుటుంబీకులకు ఇచ్చేందుకు వెళ్లగా వారు నిరాకరించి.. ఈ సాయాన్ని ఏదైనా అనాథాశ్రమానికి ఇవ్వాలని కోరారు. వారి సమక్షంలోనే మంగళవారం వికారాబాద్ పట్టణ పరిధి ధన్నారంలో గల యజ్ఞ ఫౌండేషన్ వివేకానంద గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్వల్ రాజ్‌కు డబ్బులను అందజేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ కుటుంబసభ్యులు ఉదారతను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ సోదరుడు బుచ్చిరాజ్, 2018బ్యాచ్ కానిస్టేబుళ్లు శ్రీశైలం, ప్రేమ్‌సాయి, రాజ్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు.

మారెపల్లిలో సుద్ద మాఫియా

- భారీగా అక్రమ తవ్వకాలు
- సుద్ద డంప్‌లను గుర్తించిన మైన్స్, రెవెన్యూ అధికారులు
- సీజ్ చేసినా చర్యలు శూన్యమని గ్రామస్తుల ఫిర్యాదు


అర్ధరాత్రి సుద్ద డంప్‌లను గుర్తించిన అధికారులు

తాండూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):పెద్దేముల్ మండలం మారెపల్లిలో లభించే సుద్ద(బెంటోనైట్) కు ప్రపంచ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉండటంతో అక్రమార్కులు భారీగా తవ్వకాలు జరపుతున్నారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకోకుండా మారెపల్లిలో తవ్వకాలు జరిపేందుకు సంతకాల సేకరణ చేపట్టారు. ఇక్కడి నాణ్యమైన సుద్దను విదేశాలకు ఎగుమతి చేసేందుకు కంపెనీలు పోటీపడుతున్నాయి. సుద్ద గనులను ఎక్కువగా లీజుకివ్వకపోవడంతో అక్రమ మైనింగ్ జోరు పెరిగింది. పర్మిషన్ ఒకచోట పొంది మరోచోట తవ్వకాలు చేస్తున్నారు. మారెపల్లి సర్వే నం:39 భూమిలో అనుమతిపొందిన దానికంటే 22గుంటల్లో అదనంగా సుద్ద తవ్వినట్లు అధికారులు తేల్చారు. సర్వే నంబర్ 39/ఎ1లో 8 గుంటలు, సర్వే నంబర్ 39/ఎ2లో 9గుంటల్లో అక్రమంగా తవ్వారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు జమాలుద్దీన్ నాయకత్వంలో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమాలపై గతంలోనూ ఫిర్యాదులు చేశామని తెలిపారు. సుద్దను సీజ్ చేసినా రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. అధికారులు నామమాత్ర జరిమానాలతో సరిపెడుతున్నారు. సుద్దమాఫియా, అక్కడి సిండికేట్ సభ్యులు అధికారుల దాడులు జరగకుండా చూస్తున్నారు. కాగా సుద్ద భూములు కలిగిన రైతులు లీజుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వానికి రాయల్టీ కట్టాల్సి వస్తుందని అక్రమ తవ్వకాలకే మొగ్గు చూపుతున్నారు. రాత్రిపూట సుద్ద తవ్వి ఓపెన్ ప్లాట్లలో ఆరబోస్తున్నారు. అధికారులు పట్టుకుంటేనే అక్రమాలు బయటపడుతున్నాయి. మైన్స్ శాఖలో సిబ్బంది సరిపడా లేక తనిఖీలు చేయడం లేదనే వాదనా వస్తోంది. అక్రమార్కులకు ఇది అవకాశంగా మారింది. ఇదిలా ఉంటే సుద్ద అక్రమ రవాణా, తవ్వకాలను నివారించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

షోకాజ్ నోటీసులిచ్చాం



సుద్ద అక్రమ తవ్వకందారులను గుర్తించాం. అక్రమార్కులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. లీజు పర్మిట్ లేకుండా సుద్ద తవ్వకం జరిపితే తవ్విన వైశాల్యాన్ని బట్టి రూ.2కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు తవ్వకాలపై పంచనామా రిపోర్టును అందజేశారు. సుద్ద అక్రమ తవ్వకంపై నిఘా పెంచాం.

- సత్యనారాయణ, ఏడీ, మైన్స్

నెరవేరిన కల

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ప్రతీనెల రూ.31,040 వేతనంగా పొందనున్నారు. తమకు ఉద్యోగం వస్తుందో రాదో అని ఇన్ని రోజులు బాధలో ఉన్న అభ్యర్థుల సుదీర్ఘ ఎదురుచూపులకు తెరపడింది.

తీరనున్న టీచర్ల కొరత..

జిల్లాలో వేధిస్తున్న టీచర్ల కొరత తీరనుంది. తాజాగా నియామక పత్రాలు అందుకున్న టీచర్లు విధుల్లో చేరారు. దీంతో ఉపాధ్యాయుల కొరతకు కొంత ఊరట లభించింది. 2024 డీఎస్సీ ద్వారా జిల్లాలో 379 పోస్టులను భర్తీ చేశారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 71, ఎస్‌జీటీలు 272, లాంగ్వేజ్ పండిట్ 30, పీఈటీ పోస్టులను ఆరు ఉన్నాయి. వీటితో పాటు కాంట్రాక్టు పద్ధతిలో 2008 డీఎస్సీకి చెందిన 95 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. అత్యధికంగా తలకొండపల్లి మండలానికి 13మంది టీచర్లను నియమించారు. అత్యల్పంగా నందిగామ మండలానికి ఒక టీచర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. జిల్లాలో చాలావరకు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడంతో ఉపాధ్యాయుల కొరత తీరింది.

దారిన పడేదెప్పుడో!

కంకర రోడ్డుతో అవస్థలు

ఏడాదిగా వాహనదారులకు తిప్పలు

యాచారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ఏడాదిగా వాహనదారులు కంకర రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారు. యాచారం మండలంలోని కొత్తపల్లి నుంచి తండా వరకు మూడు కిలోమీటర్ల వరకు రోడ్డు పూర్తిగా పాడవడంతో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రూ.50లక్షలు విడుదల చేయించారు. కాంట్రాక్టర్ కంకర వేసి చేతులు దులుపుకున్నాడు. బీటీ వేయాలని కోరుతున్నా పట్టించుకునే వారు లేరని గిరిజనులు ఆరోపిస్తున్నారు. కంకర రోడ్డుపై వెళ్తుంటే బండ్లు పాడవుతున్నాయని, అదుపుతప్పి కింద పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను గుర్తించి రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.



యాచారం మండలంలోని కొత్తపల్లితండా రోడ్డు దుస్థితి

క్రైం కార్నర్

కాలి బూడిదైన పశుగ్రాసం

యాచారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీతిరుమలేషుని గుట్ట కింద గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పశుగ్రాసం కాలిబూడిదైంది. మంగళవారం మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు చౌదర్‌పల్లి వెళ్లే దారిలో గుట్టకింది ప్రాంతంలో మంట పెట్టడంతో పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. ఆ మంటలు వ్యాపించి చెట్లు సైతం కాలిపోయాయి. పశుగ్రాసం కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు వాపోయారు.

ఇంట్లో చోరీ.. నిందితుడి అరెస్ట్

కడ్తాల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై దొంగతనానికి పాల్పడిన వ్యక్తి పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యాడు. కడ్తాల సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పల్లెచెలుక తండాకు చెందిన జర్పుల బీచ్య, మంగమ్మ దంపతులు. ఈనెల 3న వేసి పని నిమిత్తం బయటకు వెళ్లారు. పిల్లలు ఇంటికి తాళం వేసి స్కూల్‌కు వెళ్లారు. మరుసటిరోజు ఇంట్లో బీరువాలో చూడగా రూ.1.10 లక్షలు కన్పించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళం తీసి చోరికి పాల్పడ్డారని మంగమ్మ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వరప్రసాద్, పోలీసు సిబ్బంది అదే గ్రామానికి చెందిన జర్పుల కుమార్‌పై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. మంగమ్మ ఇంటికి కూలి పనులకు వెళ్లిన కుమార్ ఇంట్లో డబ్బు దాచిపెట్టిన విషయాన్ని గుర్తించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు కుమార్‌ను అరెస్ట్ చేసి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నారు.

శ్రీవారి దర్శనానికి వెళ్లిన భక్తుడు గుండెపోటుతో మృతి



వెంకటేశ్(ఫైల్)

చౌదరిగూడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి వెళ్లిన భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ఇంద్రనగర్ గ్రామానికి చెందిన ఉప్పరి వెంకటేశ్(50) లాల్‌పహాడ్‌లో బట్టల షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి పలు షాపుల నిర్వాహకులతో కలిసి తిరుపతి వెళ్లారు. మంగళవారం ఉదయం నడకదారిన దర్శనానికి వెళ్తున్న క్రమంలో 200వ మెట్టు వద్ద కుప్పకూలిపోయాడు. సిబ్బంది వెంటనే అక్కడి నుంచి చికిత్స నిమిత్తం చంద్రగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కుంటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించి మృతదేహాన్ని ఏపీ నుంచి మండలానికి తరలిస్తున్నారు. మృతుడికి భార్య హైమావతి, ఇద్దరు కుమారులు వివేక్, శ్రీశాంత్, కూతురు భవిత ఉన్నారు.

సీఎండీని కలిసిన మల్లు రవి



సీఎండీ మణిమేఖలకు బొకే ఇస్తున్న ఎంపీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎండీ మణి మేఖలను మంగళవారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ముంబైలోని కార్యాలయంలో కలిసి ఆమెకు పుష్ప గుచ్ఛం అందజేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కల్వకుర్తి, అచ్చంపేట, ఆలంపూర్, కోల్లాపూర్, గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలలో యువతకు ఉపాధి కల్పనకు బ్యాంక్ ద్వారా రుణాలు అందించాలని సీఎండీని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష చేస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం చేస్తామన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 110వ రోజుకు చేరాయి. గ్రామంలో ర్యాలీ నిర్వహించి తొమ్మిది గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్ చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్ కోరారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. లేనియెడల ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు.

చెక్కుల అందజేత

చేవెళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారికంగా సద్గురు సేవలాల్ మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహిస్తుందని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సద్గురు సేవలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం మంజూరు చేసి రూ.44,000 విలువైన చెక్కులను మంగళవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో నిర్వాహకులకు అందించారు. పోతుగల్ గ్రామానికి రూ.22 వేలు, శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామానికి రూ.22 వేలు సేవలాల్ జయంతి ఉత్సవాల ఖర్చుల నిమిత్తం అందించినట్లు తెలిపారు.

ప్రతిభ కనబర్చిన స్వామినారాయణ విద్యార్థులు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్వామినారాయణ గురుకుల అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలోని శ్రీ స్వామినారాయణ గురుకుల్ అంతర్జాతీయ పాఠశాల హాస్టల్ విభాగానికి చెందిన విద్యార్థు లు డాక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుచిరిండియా ఫౌండేషన్ రామన్ యంగ్ జీనియస్ అవార్డు-2025గాను రామన్ రాష్ట్ర ఒలింపియాడ్ నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటారు. ఇందులో దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబర్చిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంతకు స్థలం కేటాయించాలి

యాచారం. ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని మాల్‌లో సర్వే నంబర్ 640లో మూడెకరాల భూమిని సంతకు కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు పడకంటి శేఖర్, జహంగీర్ తదితరులు మంగళవారం తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందించారు. నేడు సంత వెంచర్‌లో నడుస్తుందని, పశువుల సంతకు భూమి కేటాయిస్తే పంచాయతీకి ఆదాయం కూడా వస్తుందని తహసీల్దార్‌కు వివరించారు. వారంలో భూ సర్వే చేసి సంతకు స్థలం కేటాయించనున్నట్లు తహసీల్దారు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నాయకులు కృష్ణ, గోపాల్, మాధవి, బాలరాజ్ ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'హిప్పో క్యాంపస్'పై చర్యలు తీసుకుంటాం



హిప్పో క్యాంపస్ స్కూల్‌లో యాజమాన్యంతో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

నందిగామ, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): ఫీజు చెల్లించలేదంటూ విద్యార్థులను తరగతి గదిలోకి అనుమతించకుండా ఎండలో కూర్చోబెట్టిన ఘటన నందిగామ మండల పరిధిలోని హిప్పో క్యాంపస్ స్కూల్లో సోమవారం చోటుచేసుకుందని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పం దించారు. మంగళవారం పాఠశాలకు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు రాయిస్తామనడం సమంజసం కాదని యాజమాన్యాన్ని మందలించారు. ఈ ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత



ఆలయ కమాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి,

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దైవ భక్తితో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి ముఖద్వారాన్ని అదే గ్రామానికి చెందిన నక్కల స్వరూప సత్యనారాయణగౌడ్ తన కుమారుడు దివంగత డాక్టర్ నక్కల విక్రమాదిత్యగౌడ్ జ్ఞాపకార్థం నిర్మించారు. ఆ కమాన్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, అగ్గనూరి బస్వం, చెంది తిరుపతిరెడ్డి, మామిడిపల్లి వెంకట్‌రెడ్డి, ఆశన్న గౌడ్, రాములుగౌడ్, వేణుగౌడ్, రాయికల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వెంకటేశ్ నేత

చేవెళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలనికి నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు. మంగళవారం చేవెళ్లలోని వివేకానంద ఇంటర్నేషనల్ పాఠశాల వార్షికోత్సవానికి ఎంఈవో పురందాస్, సీఐ భూపాల్‌శ్రీధర్, పాఠశాల చైర్మన్ కొరడాల నరేశ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హన్మంత్‌రావు, కరస్పాండెంట్ లావణ్య, ప్రిన్సిపాల్ అర్చన, రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వేణుకుమార్, మేనేజర్ నరేష్ ఉన్నారు.

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



కేశంపేట: లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి

కేశంపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడానికి ముందుకురావాలని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. సంగెం, వేముల్‌నర్వ, ఇప్పలపల్లి, దేవునిగూడి తండా, పాపిరెడ్డిగూడ గ్రామాల్లో అధికారులు నర్సరీలను పరిశీలించారు. సంగెం గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీవో కిష్టయ్య, హౌసింగ్ ఏఈ కరుణాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్, మాజీ సర్పంచ్ నిధురం కృష్ణయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హనుమగళ్ల రమేశ్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ అన్నారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ అబ్దుల్ హకీంతో కలిసి మంగళవారం ఏర్వగూడ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గ్రామంలో 10మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. శంకర్‌పల్లి అతిథి గృహంలో ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హమీద్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పలత కుటుంబాన్ని ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, మహిళా సంఘం కార్యకర్తలు

యాచారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడైన భర్త మరణంతో కుటుంబం అనాథగా మారిందని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలంలోని నల్లవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళా సంఘం జిల్లా నాయకురాళ్లతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా చేశారు. నల్లవెల్లికి చెందిన శ్రీరాములు, పుష్పలత దంపతులు. వీరికి కుమారుడు షన్ముఖవల్లభ, కుమార్తె వింద్యావాసిని ఉన్నారు. శ్రీరాములు హయత్‌నగర్ మండలంలోని ఇంజాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ గతేడాది మే 24న మంచాల మండలంలోని రంగాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడని మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుమలత, మండల కార్యదర్శి అరుణ, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అన్నారు. అయితే శ్రీరాములుకు చెందిన డైరీ, సెల్‌ఫోన్‌ను మృతుడి అన్న శంకరయ్యతోపాటు కుటుంబీకులు దాచారని, పుష్పలత ఇవ్వాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన రూ.40 లక్షలు కూడా పుష్పలతకివ్వకుండా దాచుకున్నారని ఆరోపించారు. ఆమెకు ప్రభుత్వపరంగా ఉద్యోగం రాకుండా కలెక్టర్, డీఈవోలకు తప్పుడు సమాచారమందించి పుష్పలతను వేదిస్తున్నారని పేర్కన్నారు. పుష్పలతను ఆదుకోవాలని స్వయంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి డీఈవోకు ఫోన్ చేసి చెప్పినా మృతుడి తల్లి వచ్చేదాక న్యాయం జరగదని డీఈవో చెప్పడం దారుణమని మండిపడ్డారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. శ్రీరాములు సోదరుడు శంకరయ్యతోపాటు ఇతర కుటుంబ సభ్యులపై యాచారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ధర్నాలో సీపీఎం నాయకులు జంగయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

మొయినాబాద్, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మొయినాబాద్‌లో షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీఓ సంధ్య, టీపీసీసీ సభ్యుడు షాబాద్‌దర్శన్, పీఏసీఎస్ చెర్మన్ చంద్రారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జంగయ్య, నాయకులు రాములు, రాజుగౌడ్, రాంరెడ్డి, మహేందర్‌ముదిరాజ్, రమేష్, గడ్డం వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకోవాలి

మొయినాబాద్ రూరల్: ప్రతి ఒక్కరూ దేవాలయాలను సందర్శించడం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మండలంలోని అమ్డాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన మైసమ్మ, ఎల్లమ్మ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనకు జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో షాబాద్ దర్శన్, అమ్డాపూర్ మాజీ సర్పంచ్ బూర్గు రవళి గోపికృష్ణారెడ్డి, మోత్కుపల్లి రాములు, మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



కేశంపేటలో స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

కేశంపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దవళగిరి గుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున అలవేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి దవళగిరి గుట్ట నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు గ్రామ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో లాగారు. శివ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో తలసాని రమాదేవి, మోహన్ రెడ్డి దంపతులు హోమం నిర్వహించారు. సాయంత్రం రైతులు, వ్యాపారులు ఎడ్ల బండ్లు, వాహనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్యచారి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నక్క చంద్రశేఖర్, రామకృష్ణ చారి, మురళీమోహన్, యుగందర్, దశరథం, మంచె కృష్ణయ్య, పాండుగౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, బాల్‌రాజ్, నక్క గోపాల్, శివాజీ, పాండు పాల్గొన్నారు.

ముగిసిన కొనగట్టు ఆలయ బ్రహ్మోత్సవాలు



కొనగట్టు శివాలయంలో హోమంతో పూర్ణాహుతి చేస్తున్న భక్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కొనగట్టు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయ ధర్మకర్త సున్నపు వసంతం, ప్రధాన అర్చకుడు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రుద్ర హోమంలో పాల్గొన్నారు. చివరి రోజు పూర్ణహుతితో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి విరాళం అందించిన నేపథ్యంలో గోశాలను ఆయన ప్రారంభించారు.

వైద్య శిబిరానికి స్పందన

తలకొండపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అర్లకుంట తండాలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. కడ్తాల అగస్త్య ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యులు జర్పుల మంజుల, డాక్టర్ జంప్లా నాయక్ 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పించారు.

కూలీలందరికీ పని కల్పిస్తాం

యాచారం. ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పని కోరిన ప్రతి వ్యక్తికి వంద రోజులపాటు ఉపాధి కల్పిస్తామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మల్కీజ్‌గూడలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ఉదయం 8 గంటలకే పనులు ప్రారంభించాలని సూచించారు. కూలీలకు తాగు నీటి వసతి కల్పించడంతోపాటు టెంట్‌లు వేయించాలని, మెడికల్ కిట్ అందుబాటులో పెట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లను, సాంకేతిక నిపుణులను ఆదేశించారు. రోజూ రూ.300 వచ్చేలా పనులు చేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో లింగయ్య ఉన్నారు.

ప్రజా గాయకుడు శేఖర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేశంపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర మరువలేనిదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామానికి చెందిన ప్రజా గాయకుడు పాపాకంటి శేఖర్ 10వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కేశంపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపాకంటి పోరాట విలువలను గుర్తు చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, పాపాకంటి సోదరుడు పాపాకంటి కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, నేదునూరు శ్రీను, నిర్దవెల్లి శ్రీనివాస్, శ్రీధర్, మురళీమోహన్, చంద్రయ్య, పవన్ రెడ్డి, తులసీ రాములు, దశరథ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ తాలుకా ఉపాధ్యక్షుడు శ్రీను, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



ఆర్థికసాయం అందజేస్తున్న గూడూరు శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదలు, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడవద్దని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని 13వ వార్డులో మంగళవారం పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ముత్తి తులసీదాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా తగిన సాయం అందేలా చూస్తానన్నారు. నాయకులు లక్ష్మయ్య, జహంగీర్‌బాబా, జహంగీర్‌అలీ, మంకి శ్రీను, శ్రీకాంత్, రవి, రాజేశ్, మహేశ్, రమేశ్, రామకృష్ణ శ్రీను, అంజయ్య, జంగయ్య, శ్రీశైలం, మహేశ్, శ్రీకాంత్ గౌడ్, నర్సింహ ఉన్నారు.

నేడు కొందుర్గుకు ఎంపీ డీకే అరుణ

చౌదరిగూడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని కొందుర్గు మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పాల్గొంటారని బీజేపీ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కొందుర్గు ఎస్ఐకి సన్మానం

చౌదరిగూడ, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కొందుర్గు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌నాయక్‌ను ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శాలువాతో సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్, నాయకులు చెన్నయ్య, వెంకటేష్, విజయ్, కబీర్‌దాస్, ప్రసాద్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి శ్రమించాలి



రూప్లీబాయికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త శ్రమించాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం యాచారం మండలంలోని బొల్లిగుట్టతండాలో మాజీ సర్పంచ్ రాజునాయక్ తల్లిరూప్లీబాయి ప్రథమ వర్ధంతికి హాజరై నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని సరిగా అమలు చేయడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే ఇప్పటికే సాగర్ హైదరాబాద్ ప్రధాన రహదారి వెడల్పు అయ్యేదన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షకార్యదర్శులు రమేశ్ గౌడ్, భాషా, మాజీ ఎంపీపీ కృపేశ్, నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, నిట్టు జగదీశ్, జెర్కొని రాజు, ఆకుల యాదగిరి ఉన్నారు.